
సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శనివారం । 18 । జనవరి । 2025



ఎడ్‌సెట్‌ను సమర్థవంతంగా..

అందరి సహకారంతో ఎడ్‌సెట్–25ను సమర్థవంతంగా నిర్వహిద్దామని కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. - IIలో▸



ప్రతిభ చాటితే నవోదయమే..

జవహర్ నవోదయ విద్యాలయంలో 2025 – 26 సంవత్సరానికి ఆరోతరగతిలో ప్రవేశానికి నేడు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. - IIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.3°/15.2°

జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి ఎక్కువగా ఉంటుంది.

ఓరుగల్లు దీప్తి.. అర్జున కీర్తి

రాష్ట్రపతి చేతుల మీదుగా అర్జున అవార్డు అందుకున్న కల్లెడ బిడ్డ దీప్తి జివాంజీ

- మానసిక లోపం అధిగమించి పారా అథ్లెట్‌గా ప్రతిభ
- ప్రతిష్టాత్మక అవార్డు తీసుకోవడంతో జిల్లాలో సంబురాలు

సాక్షి, వరంగల్/పర్వతగిరి: ఓరుగల్లు కీర్తి.. ఢిల్లీకి చేరింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన పారా అథ్లెట్ 'జివాంజీ దీప్తి' న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అర్జున అవార్డు తీసుకోవడంతో జిల్లాలో ఆనందం వ్యక్తం అవుతోంది. మన 'అర్జును'డే దీప్తి అంటూ సంబురాల్లో మునిగి తేలారు. కల్లెడ నుంచి తీసిన పరుగులు.. కోబె వరకు చేరుకుని ఏకంగా 2023 పారా ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించి వరంగల్ జిల్లాతోపాటు దేశవ్యాప్తంగా అందరిచే ఔరా అనిపించుకుంది. పేదరికంతో పాటు మానసికంగా లోపమున్నా అధిగమించి అంతర్జాతీయ వేదికలపై రాణించి భారత్ కే దీపంగా మారడంతో హర్షం వ్యక్తమవుతోంది.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అర్జున అవార్డు అందుకుంటున్న దీప్తి జివాంజీ



కల్లెడ నుంచి కోబె వరకు..

కల్లెడలోని రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (ఆర్డీఎఫ్) పాఠశాలలో ఇంటర్మీడియట్ వరకు చదివిన దీప్తి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో పారా అథ్లెట్‌గా పరుగులు తీసింది. ఈసమయంలో కోచ్ రమేశ్ దృష్టిలో పడింది. ఆయన ప్రోత్సాహం.. బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఆర్థికంగా అండగా నిలవడంతో అంతర్జాతీయ వేదికలపై రాణించగలిగింది. ఇలా 2019లో జరిగిన ఆసియా యూత్ చాంపియన్ షిప్‌లో కాంస్య పతకం సాధించింది. ఆ తర్వాత ఏడాదిలో ఖేలో ఇండియా గేమ్స్‌లో 100 మీటర్లు, 200 మీటర్ల రేసులో స్వర్ణ పతకాలు సాధించింది. 2022లో మొరాకో వేదికగా జరిగిన ప్రపంచ పారా గ్రాండ్ ప్రీలో ఆమె టీ–20, 400 మీటర్ల పరుగులో పసిడితో మెరిసింది. దీప్తి ప్రతిభకు దక్కిన తొలి అంతర్జాతీయ స్వర్ణమిదే. 400తో పాటు 200 మీటర్లలోనూ తన సత్తా చాటింది. అదే ఏడాది బ్రిస్బేన్ వేదికగా వర్చుస్ ఆసియా ఓసియానియా పోటీల్లో 200 మీటర్లలో 26.82 సెకన్లలో లక్ష్యాన్ని చేరి పసిడి పతకం గెలిచిన ఆమె 400 మీటర్లను 57.58 సెకన్ల వ్యవధిలోనే పూర్తి చేసి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. ప్రతి పోటీలోనూ అదే స్పీడ్ కొనసాగిస్తూ వెళ్లిన దీప్తి 2023 పారా ఆసియా క్రీడల ప్రదర్శనలో తన ప్రతిభతో మరో ఎత్తుకు ఎదిగింది. 2024లో పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్యం, 2024 ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో బంగారు పతకం దక్కించుకుంది. ఈ ఘన విజయం సొంతం చేసుకున్న తర్వాత దీప్తిపై ప్రశంసల వర్షం కురిసింది.

అర్జున అవార్డు రావడం ఆనందంగా ఉంది..



మా కూతురుకు అర్జున అవార్డు రావడం ఆనందంగా ఉంది. ఆర్డీఎఫ్ విద్యా సంస్థల ద్వారా ఉచిత చదువుతోపాటు అథ్లెటిక్స్‌కు ఉచిత కోచింగ్ ఇచ్చిన పీఈటీ వెంకటేశ్వర్లు, నాగపురి రమేశ్, ఎర్రబెల్లి సహకారం మరువలేనిది. మానసిక ఎదుగుదల సరిగా లేని కారణంగా దీప్తిని అందరూ చిన్నచూపు చూశారు. వాటిని అధిగమించి పారాలింపిక్స్‌లో రాణించింది.

- యశోద, యాదగిరి, దీప్తి తల్లిదండ్రులు

మరిన్ని పతకాలు సాధిస్తా..

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అర్జున అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది. నా అవార్డును తెలుగు రాష్ట్ర ప్రజలకు అంకితం చేస్తున్నా. అందరి సహకారంతో ఒలింపిక్స్‌లో ఆడి మరిన్ని పతకాలు సాధించే విధంగా ముందుకెళ్తా.

- దీప్తి జివాంజీ

న్యూస్‌రీల్

20న సదరం క్యాంపు

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని పలు మండలాలతో పాటు భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న శారీరక, వినికిడి, మానసిక, కంటిచూపు అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు ఈనెల 20వ తేదీ సోమవారం జిల్లాకేంద్రంలోని 100 పడకల ఆస్పత్రిలో సదరం క్యాంపును నిర్వహించనున్నట్లు డీఆర్డీఓ నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల దివ్యాంగులతో పాటు రెన్యూవెల్ చేసుకునేవారు మీసేవల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. క్యాంపు నిర్వహించే రెండు రోజుల ముందు మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్నవారు మాత్రమే క్యాంపులకు హాజరు కావాలన్నారు. గతంలో తిరస్కరణకు గురైన వారికి అవకాశం లేదని తెలిపారు.

యాదాద్రిలో ఎమ్మెల్యే దంపతులు



భూపాలపల్లి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు–పద్మ దంపతులు ఉత్తర ద్వారం గుండా దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు, అర్చకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఎమ్మెల్యే దంపతులకు అర్చకులు వేదాశీర్వచన మండపంలో ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆటస్థలం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సాకికుంటలో పల్లెప్రకృతి వనం తొలగించి ఆటస్థలం(గ్రౌండు) ఏర్పాటు చేయాలని యువకులు కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం కాళేశ్వరం వచ్చిన కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయగా కుంట వద్దకు వెళ్లి పరిశీలించారు. పరిశీలించాలని గ్రామపంచాయతీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

నాటు సారాయి కేంద్రాలపై స్పెషల్ డ్రైవ్

భూపాలపల్లి రూరల్: జిల్లావ్యాప్తంగా నాటుసారా అరికట్టడంపై జనవరి 16నుంచి ఫిబ్రవరి 15వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అధికారి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నాటు సారాయి తయారీదారులను గుర్తించడం, నాటు సారాయి తయారీ ముడి పదార్థాలను అమ్మేవాళ్లను గుర్తించడం, వారందరినీ అరెస్టు చేసి కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వారిని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. గుడుంబా తయారీ, విక్రయం మానుకోకుంటే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని చెప్పారు.

నేడు డయల్ యువర్ డీఎం

భూపాలపల్లి అర్బన్: ఆర్టీసీ సమస్యలు, ఇబ్బందులపై నేడు(శనివారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిపో పరిధిలోని వివిధ మండలాల, గ్రామాల ప్రజలు, వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు 99592 26707 ఫోన్ నంబర్‌కు మధ్యాహ్నం 12 గంటల నుంచి 1గంట వరకు ఫోన్ చేసి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

ఉసురు తీస్తున్న ఫైనాన్స్‌లు

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వడ్డీ వ్యాపార సంస్థలు

- నూటికి రూ.10వరకు వడ్డీ వసూలు
- డబ్బులు చెల్లించకుంటే ఇంటికి వచ్చి బెదిరింపులు
- వేధింపులతో ఇటీవల దంపతుల మృతి

భూపాలపల్లి మండలం కమలాపూర్‌కు చెందిన బానోత్ దేవేందర్, చందనలు కూలీ పని చేసుకొని జీవనం సాగిస్తుంటారు. ఇంటి అవసరాల కోసం జిల్లా కేంద్రంలోని మైక్రో.. తదితర ఫైనాన్స్ సంస్థల వద్ద సుమారు రూ.3లక్షల రుణం తీసుకున్నారు. వారం వారం చెల్లించాల్సిన రుణం చెల్లించలేక, అప్పు ఇచ్చిన వారి వేధింపులు భరించలేక గతనెలలో భార్యాభర్తలిద్దరూ ఒకరి తరువాత ఒకరు బలవన్మరణానికి పాల్పడ్డారు.

గతేడాది ఏప్రిల్ నెలలో వడ్డీ వ్యాపారి వేధింపులు తాళలేక ఓ చిరువ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ వేధింపులు ఒకరిద్దరు ఎదుర్కొంటున్న సమస్య కాదు. మైక్రో ఫైనాన్స్, ఇతర సంస్థల వద్ద అధిక వడ్డీకి తీసుకున్న డబ్బులు చెల్లించలేక వందలాది మంది పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



భూపాలపల్లి: జిల్లాలో నాలుగైదు అనుమతి పొందిన వడ్డీ వ్యాపార సంస్థలు ఉండగా, కొందరు చిట్స్ పేరిట ఆఫీసులు ఏర్పాటు చేసుకొని, మరికొందరు సింగరేణి ఉద్యోగులు, వ్యాపారులు ఇంటి వద్ద నుంచే వడ్డీ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. పిల్లల విద్య, వైద్యం, కుటుంబ అవసరాల నిమిత్తం అప్పు కోసం వచ్చిన వ్యక్తి నుంచి బ్యాంకు ఖాతాబుక్, చెక్‌బుక్, ఏటీఎం కార్డు, ఇంటి, వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు, బంగారు నగలు తీసుకుంటున్నారు. వీటికి తోడు ప్రామిసరీ నోటుపై వివరాలు ఏమీ రాయకుండానే బాధితుడి సంతకం చేయించుకుంటున్నారు. అప్పు తీసుకునే వ్యక్తి అవసరం ఆధారంగా నూటికి రూ.6నుంచి రూ.10వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. అప్పు ఇచ్చిన వ్యాపారే ప్రతీ నెల బ్యాంకుకు వెళ్లి తనఖా ఉంచుకున్న ఏటీఎం కార్డు లేదా చెక్‌బుక్‌ల సహాయంతో డబ్బులను విడిపించుకుంటున్నారు. రావాల్సిన వడ్డీ, అసలులో కొంతభాగాన్ని తీసుకొని మిగిలిన డబ్బులను బాధితుడికి తిరిగి ఇస్తున్నారు.

ఖమ్మం నుంచి వచ్చి మరీ..

జిల్లాలో వడ్డీ వ్యాపారం సాఫీగా జరుగుతుండటంతో ఖమ్మంకు చెందిన కొందరు వ్యాపారులు భూపాలపల్లి బాట పట్టారు. అయితే వీరు స్థానిక వ్యాపారుల కంటే అధిక వడ్డీ వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు రూ.10వేలు అప్పుగా ఇచ్చి, వారానికి రూ.వేయి చొప్పున 12 వారాల్లో రూ. 12 వేలు వసూలు చేస్తున్నారు. అంటే సుమారు 90 రోజుల్లోనే రూ.2వేల వడ్డీ చెల్లించాల్సి వస్తుంది.

మహిళలను గ్రూపులుగా ఏర్పాటు చేసి..



జిల్లా కేంద్రంలోని కొన్ని సంస్థలు స్థానిక మహిళలను గ్రూపులుగా ఏర్పాటు చేసి సిబిల్ స్కోర్ ఆధారంగా తొలుత ఒక్కొక్కరికి రూ.20వేల నుంచి రూ.40వేల వరకు అప్పుగా ఇస్తున్నారు. అట్టి అసలులో కొంత మొత్తం, వడ్డీని ప్రతీ వారం చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కరోజు కూడా ఆలస్యం చేయకూడదు. గ్రూపులో ఏ ఒక్కరు డబ్బులు చెల్లించకపోయినా మిగిలిన సభ్యుల డబ్బులు కూడా తీసుకోకుండా అదనపు వడ్డీ కోసం వేస్తున్నారు. దీంతో సభ్యులంతా డబ్బులు చెల్లించని వారి ఇంటికి వెళ్లి నిలదీస్తున్నారు.

దృష్టిసారించని పోలీసులు..

అనుమతులు లేకుండా అధిక వడ్డీ వసూలు చేస్తున్న వ్యాపారులపై పోలీసులు పెద్దగా దృష్టి సారించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గతేడాది ఓ చిరు వ్యాపారి ఆత్మహత్య చేసుకోవడంతో ఒకేరోజు జిల్లావ్యాప్తంగా పోలీసులు దాడులు నిర్వహించి ప్రామిసరీ నోట్లతో పాటు విలువైన పత్రాలను స్వాధీనం చేసుకొని 12మంది వడ్డీ వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. తదనంతరం వడ్డీ వ్యాపారం యథావిధిగానే కొనసాగుతోంది.

ప్రైవేట్ ఫైనాన్స్‌లను ఆశ్రయించొద్దు

మైక్రో ఫైనాన్స్, ప్రైవేట్ ఫైనాన్స్‌లను అప్పుల కోసం ఆశ్రయించొద్దు. మైక్రో ఫైనాన్స్‌తో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. ఫైనాన్స్ సంస్థలు ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయాలి. ఆర్థిక ఇబ్బందులకు గురై ఆత్మహత్యలకు పాల్పడడం సరైనది కాదు. డబ్బులు తిరిగి చెల్లించాలని బలవంతంగా బెదిరించడం సరైన పద్ధతి కాదు. అటువంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

- సంపత్‌రావు, డీఎస్పీ భూపాలపల్లి

ఘనంగా పుష్కరాలు నిర్వహిస్తాం

- ఏప్రిల్ 30వరకు పనులు పూర్తిచేయాలి
- ఫిబ్రవరి 7, 8, 9న కుంభాభిషేకం నిర్వహణకు ఏర్పాట్లు
- కలెక్టర్ రాహుల్‌శర్మ



వీఐపీఘాటు వద్ద ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కాళేశ్వరం: కాళేశ్వరంలో ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో కుంభాభిషేకం, మే నెలలో జరిగే సరస్వతీనది పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తామని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఆయన కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో కలిసి ఈఓ కార్యాలయంలో కుంభాభిషేకం, సరస్వతీనది పుష్కరాల నిర్వహణ, ఆలయ అభివృద్ధి పనులపై దేవాదాయ శాఖ, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ, ట్రాన్స్‌కో, మత్స్యశాఖ, వైద్యశాఖ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాళేశ్వరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే కుంభాభిషేకానికి సుమారు 20వేలకుపైగా భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. గోపురం పనులు పూర్తిచేయాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా మరుగుదొడ్లు, లైటింగ్, దుస్తులు మార్చుకునే గదులు, స్నానాలు చేయడానికి కుళాయిలు, ఘాట్లు, రహదారుల మరమ్మతులు, వాహనాల పార్కింగ్ స్థలాల ఏర్పాట్లపై అధికారులు చేయాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను అన్నిశాఖల అధికారులతో సమన్వయంతో త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పుష్కరాలు నిర్వహణకు అన్ని శాఖల అధికారులు మాస్టర్ ప్లాన్ తయారుచేయాలని సూచించారు. అన్ని ఏర్పాట్లు ఏప్రిల్ 30వ తేదీ వరకు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా తయారు చేసిన ప్రణాళికలపై ఆర్కిటెక్చర్ జీఎస్‌వీ సూర్యనారాయణ మూర్తి వివరించారు. కలెక్టర్ కాళేశ్వరం వీధుల్లో కలియదిరిగారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఏఎస్పీ బోనాల కిషన్, డీపీఓ నారాయణ రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డీఈఈ సూర్యప్రకాశ్, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖల అధికారులు, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్, డీటీ కృష్ణ, మహదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేకానికి సమన్వయ కమిటీ

కుంభాభిషేకం విజయవంతంగా నిర్వహించడానికి దేవాదాయశాఖ అధికారులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా కలెక్టర్ రాహుల్‌శర్మ, సభ్యులు ఎస్పీ కిరణ్‌ఖరే, కన్వీనర్‌గా దేవాదాయశాఖ ఆర్జేసీ రామకృష్ణరావు, పర్యాటక శాఖ ఈడీ విజయ్, ఆర్టీసీ ఆర్ఎం విజయభాను, ప్రత్యేక ఆహ్వానితులు(వేదపాఠశాల ప్రిన్సిపాల్) గోవిందాహరి, కల్చరల్ ఏడీలను నియమించారు.

కుంభాభిషేకం..

కుంభాభిషేకం నిర్వహణ కోసం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి క్షేత్రంలోని నాలుగు గోపురాలు, ప్రధాన ఆలయం, శ్రీశుభానందదేవి, శ్రీసరస్వతీ అమ్మవార్ల ఆలయాలకు రూ.15లక్షల వ్యయంతో కర్రలతో 30మంది కెపాసిటీతో నిల్చునే నిచ్చెన తయారు చేయనున్నారు. అక్కడ ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరుపనున్నారు. మూడు రోజుల పాటు శృంగేరి పీఠాధిపతికి చెందిన పండితులు పూజాకార్యక్రమాలు నిర్వహిస్తారు.



సరస్వతీమాత విగ్రహం నమూన చిత్రం



కుంభాభిషేకానికి గోపురాల వద్ద నిర్మించనున్న కర్రల నిచ్చెనల నమూనా చిత్రం

43ఏండ్ల తరువాత..

1982లో జీర్ణోద్ధరణ సమయంలో శృంగేరి పీఠాధిపతితో కుంభాభిషేకం నిర్వహించగా, మళ్లీ 43 ఏండ్ల తరువాత ఆలయంలో కుంభాభిషేకం నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో అప్పటి చైర్మన్ జువ్వాడి చొక్కారావు, సభ్యులు పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

వీఐపీ ఘాటు వద్ద సరస్వతీమాత..

మే 15నుంచి 26 వరకు జరగనున్న సరస్వతీ నది పుష్కరాల ప్రారంభోత్సవం వీఐపీ ఘాటు త్రివేణి సంగమం వద్ద చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో రూ.కోటితో వీఐపీఘాటు వద్ద తీరం పైన 20ఫీట్ల ఎత్తు సరస్వతిమాత విగ్రహంతో పాటు చుట్టూరా నలుగురు రుగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అధర్వన వేదం దేవతామూర్తుల విగ్రహాల ఏర్పాట్లకు సన్నహాలు చేస్తున్నారు. ఈ విగ్రహాలను తమిళనాడులోని కుంభకోణంలో తయారు చేస్తారు. అక్కడికి ఈఓ మారుతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, క్షేత్ర కన్సల్టెంట్ అర్కిటెక్ట్ సూర్యనారాయణతో పాటు అర్చకులు ఫణీంద్రశర్మ, సుబ్రమణ్యాశర్మ రెండు రోజుల్లో వెళ్లనున్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

టేకుమట్ల: సంక్షేమ పథకాలు అర్హులకు అందేందుకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని అంకుషాపూర్‌లో కొనసాగుతున్న ఆహార భద్రత, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా సర్వే నిర్వహించాలన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలో పరిశీలన నిమిత్తం క్షేత్రస్థాయిలో టీంలను నియమించినట్లు తెలిపారు. నిబంధనల మేరకు నిర్ణీత సమయంలో సర్వే పూర్తిచేయాలన్నారు. ఆయన వెంట డీసీఎస్ఓ శ్రీనాద్, తహసీల్దారు విజయలక్ష్మి, ఎంపీడీఓ అనిత, ఆర్ఐ సంతోష్, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఏఈఓలు భరత్, వినీల ఉన్నారు.

సమ్మెను ఉధృతం చేస్తాం



నినాదాలు చేస్తున్న లారీ ఓనర్లు

భూపాలపల్లి అర్బన్: వారం రోజులుగా సమ్మె చేస్తున్నా కోల్ ట్రాన్స్‌పోర్టర్లు, సింగరేణి యాజమాన్యం స్పందించడం లేదని రెండు మూడు రోజుల్లో సమ్మెను ఉధృతం చేస్తామని ది కాకతీయఖని లారీ ఓనర్స్ అసోసియేషన్ భూపాలపల్లి అధ్యక్షుడు మేకల చంద్రయ్య తెలిపారు. కిరాయి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎనిమిది రోజులుగా లారీ ఓనర్లు సమ్మె చేస్తున్నారు. ఈ సందర్భంగా లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చంద్రయ్య మాట్లాడారు. భూపాలపల్లి గనుల్లో ఉత్పత్తి అవుతున్న జీ ఫైవ్ బొగ్గును రవాణా చేసేందుకు రూ.300, జీ లెవన్ బొగ్గుకు రూ.400 చొప్పున టన్నుకు కిరాయి రేట్లను పెంచాలని కోరారు. సింగరేణి అధికారులు, ట్రాన్స్‌పోర్టర్లకు, స్థానిక ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందించినట్లు చెప్పారు. డీజిల్, టైర్లు, లారీ రిపేరు వస్తువులు, ఆయిల్, డ్రైవర్ల వేతనాలు, టోల్‌గేట్ల ధరలు పెరిగాయని, పెరిగిన ధరలతో చాలీచాలనీ కిరాయిలతో లారీలు నడపడం ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. సరిపడా కిరాయిలు రాక ప్రతీ నెల ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక కొంతమంది యాజమానులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో సమ్మె చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి, గణపురం లారీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు అన్వర్‌పాషా, రవి, సురేందర్, జగ్గరావు, సాంబయ్య, రవి, రాజిరెడ్డి, రాంరెడ్డి, అశోక్‌రెడ్డి, బాలచంద్‌నాయక్, తిరుపతి పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్ట్ ఉండదు

- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ కిరణ్ ఖరే



భూపాలపల్లి: ఇటీవల వివిధ ప్రభుత్వ ఏజెన్సీల పేరిట డిజిటల్ అరెస్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, డిజిటల్ అరెస్ట్ అనేది ఉండదని, ప్రజలు నమ్మవద్దని ఎస్పీ కిరణ్ ఖరే శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు లాటరీలు, రివార్డులు, జాబ్స్, కమీషన్లు, డిస్కౌంట్లు, వివిధ రకాల పేరుతో సులభంగా డబ్బు సంపాదించుకోవచ్చని ఆశచూపి మోసం చేస్తున్నారని అన్నారు. మొబైల్‌కు వచ్చిన ఓటీపీ ఎవరికీ చెప్పొద్దని, అనవసర సమయాల్లో ఇంటర్నెట్ ఆఫ్ చేయడం మంచిదని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపిన లింకులను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదన్నారు. అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే ఉపయోగించుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత విషయాలు అప్‌లోడ్ చేయవద్దన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలంటే అప్రమత్తతే ఆయుధమని చెప్పారు. మొబైల్ ఫోన్లు, వ్యక్తిగత ఈమెయిల్, వాట్సాప్‌లలో వచ్చే అనుమానాస్పద లింకులు, సందేశాలకు స్పందించవద్దని, ఎక్కువ డబ్బు ఆశ చూపే వారి పట్ల అలర్ట్‌గా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి జిల్లా పోలీసులు గ్రామాల్లో, పాఠశాలు, కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్‌చేసి వివరాలు తెలియజేస్తే 24గంటల్లో డబ్బు తిరిగి వచ్చే అవకాశం ఉందని ఎస్పీ కిరణ్ ఖరే వెల్లడించారు.

పత్తి చేనులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



గోవిందరావుపేట: మండల పరిధిలోని చల్వాయి మచ్చాపూర్ గ్రామాల మధ్య ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పత్తి చేనులోకి దూసుకెళ్లింది. వరంగల్ 2 డిపోకు చెందిన బస్సు శుక్రవారం హనుమకొండ నుంచి మంగపేటకు వెళ్తుండగా మచ్చాపూర్ చల్వాయి మధ్యలోకి రాగానే అకస్మాత్తుగా స్టీరింగ్ లాక్ అయింది. దీంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును కంట్రోల్ చేసే ప్రయత్నంలో పక్కనే ఉన్న పత్తి చేనులోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 50 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ఘటనలో వృద్ధురాలికి స్వల్ప గాయమైంది.

పశుగణన వివరాలు పక్కాగా ఉండాలి

కాటారం: పశుగణనకు సంబంధించిన వివరాలు సర్వేలో భాగంగా పక్కాగా అమలు చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కుమారస్వామి అన్నారు. 21వ పశుగణన పురోగతిపై కాటారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పశుగణన డేటా సేకరణ, పశుగణనలో ఎదురయ్యే సవాళ్లు, తదితర అంశాలపై పశుశాఖ అధికారులు, సిబ్బందితో చర్చించారు. నిర్ణీత సమయంలోగా సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో కాటారం వెటర్నిటీ అధికారి ధీరజ్ పాల్గొన్నారు.

ముగిసిన టీసీసీ పరీక్షలు

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ముగిసినట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్, ఏసీఈజీ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ప్రశాంతంగా హైయర్, లోయర్ డ్రాయింగ్, టైలరింగ్ పరీక్షలు ముగించినట్లు తెలిపారు.

ఇద్దరు పిల్లలు ఉన్నారని..

- నాగమణిని గోపి వివాహం చేసుకోవడం ఇష్టంలేని అత్తామామ, ఆడపడుచు అఘాయిత్యం
- హత్యచేసి గొయ్యితీసి పాతిపెట్టినట్లు సమాచారం
- హత్యపై కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు


నాగమణి (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: ఇటీవల సంచలనం సృష్టించిన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సిగ్నల్ కాలనీలో హత్యచేసి పూడ్చిపెట్టిన నాగమణి హత్య కేసు విషయంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, పోలీసు శాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి అనుమానితుల కోసం గాలిస్తున్నారు. గోపిని వివాహం చేసుకోవడానికి ముందే మృతురాలు నాగమణికి వివాహం జరిగి ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. ఇద్దరు పిల్లలున్న నాగమణిని గోపి వివాహం చేసుకోవడం ఇష్టంలేని అత్తామామలు రాములు, లక్ష్మి, ఆడపడుచు దుర్గ తరచూ ఆమెతో గొడవపడేవారని సమాచారం. ఈ క్రమంలోనే నెలన్నర క్రితం గోపి, నాగమణి మధ్య ఘర్షణ చోటుచేసుకోగా, ఆమె ముఖంపై గాయమైంది. మహబూబాబాద్ టౌన్ పోలీసులను బాధితురాలు ఆశ్రయించింది. రోజూ ఏదో ఒక ఘర్షణ జరుగుతూ ఉండేది. గొడవలు చిలికిచిలికి గాలివానలా మారి పది రోజుల క్రితం నాగమణితో గోపి గొడవపడగా అత్తమామలు రాములు, లక్ష్మి, ఆడపడుచు దుర్గ కలిసి ఆమెను హత్య చేసినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. నాగమణికి ఇద్దరు పిల్లలు ఉన్నారని, ఎలాగైనా సరే ఆమెను వదిలించుకోవాలని కడతేర్చి, గొయ్యితీసి కప్పిపెట్టినట్లు సమాచారం. ఈ సంఘటనకు దుర్గ భర్త మహేందర్ సహకరించడా లేదా అనే విషయం పోలీసుల దర్యాప్తులో వెల్లడికానుంది.

నాగమణితో గోపికి పరిచయం

గోపి సవరాల వ్యాపారం చేసేవాడని, తరచూ ఆంధ్ర ప్రాంతానికి వెళ్లి వచ్చేవాడని తెలిసింది. గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలోని వెంకటరెడ్డి పల్లె గ్రామానికి చెందిన ఒకరిని నాగమణి వివాహం చేసుకోగా ఇద్దరు పిల్లలు జన్మించారు. సవరాల వ్యాపారం పేరిట తరచూ గోపి వచ్చి వెళ్తుండగా నాగమణితో ఆయనకు పరిచయం ఏర్పడినట్లు సమాచారం. ఆ పరిచయంతో ఆమె మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉండేది. అప్పుడప్పుడు గోపి ఇంటికి వచ్చి వెళ్తుండేది. కొంతకాలం తర్వాత ఆమె బయ్యారం మండలం లక్ష్మీనరసింహపురం గ్రామానికి చెందిన మరొకరితో సహజీవనం చేయగా, ఆ వ్యక్తి మృతిచెందాక ఇద్దరు పిల్లలను ఎక్కడో వదిలేసి వచ్చి గోపిని వివాహం చేసుకుని ఇక్కడే ఉంటోంది. ఆ పిల్లలను మళ్లీ తన వద్దకు తీసుకురావాలని ఆమె ఆకాంక్ష మేరకు అత్తామామ, ఆడపడుచు కక్ష పెంచుకుని దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది.

చిన్నారి మృతిపై అనుమానాలు.. కేసు నమోదు

పాల్వంచ: ఓ చిన్నారి మృతి చెందిన ఘటనపై అనుమానాలు ఉన్నాయని ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో పాల్వంచ పోలీసులు కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేటకు చెందిన మంద సతీష్‌కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ నవభారత్‌కు చెందిన రమ్యశ్రీతో 2020లో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కుమార్తె నిక్షిత, 17 నెలల వయస్సు కల మేధశ్రీ సంతానం. రమ్యశ్రీ ఈనెల 9వ తేదీన పనికి వెళ్తానని ఇంటి వద్ద ఇద్దరు పిల్లలను వదిలేసి పాల్వంచలోని పుట్టింటికి చేరింది. మరుసటి రోజైన 10వ తేదీన రమ్యశ్రీ తల్లి పద్మ వచ్చి ఇద్దరు పిల్లలను తీసుకెళ్లగా 16వ తేదీన మేధశ్రీ స్పృహ కోల్పోయిందని, ఆ కాసేపటికే పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందిందని సతీష్‌కు తెలిపారు. తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని ఆయన ఫిర్యాదుతో చేయడంతో శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్సై సుమన్ తెలిపారు.

ప్రతిభ చాటితే నవోదయమే..

నేడు నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష | నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- 80 సీట్లకు 5,632 దరఖాస్తులు
- గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి


80 సీట్లు మాత్రమే..

ఖిలా వరంగల్: జవహర్ నవోదయ విద్యాయంలో 2025 –2026వ సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేశారు. మొత్తం 80 సీట్లకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 5,632 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. విద్యార్థులు నవోదయ వెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. దరఖాస్తు రిజిస్ట్రేషన్ నంబరు మరిచిపోతే మామునూరు జవహర్ నవోదయ విద్యాలయం హెల్ప్ లైన్ 0870 2556373 నంబర్ సహకారంతో రిజిస్ట్రేషన్ నంబరు తెలుసుకుని హాల్ టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోనే వెసులుబాటు ఉంది.

ఉమ్మడి జిల్లా కేంద్రంలోని మామునూరులో జవహర్ నవోదయ విద్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇక్కడ ఉచిత విద్యను అందిస్తున్నారు. కార్పొరేట్ స్థాయి వసతులతో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు నిపుణులైన ఉపాధ్యాయులతో విద్యనందిస్తున్నారు.

అభ్యర్థులకు సూచనలు

పరీక్ష కేంద్రానికి గంట ముందే వెళ్లాలి. పరీక్షకు వెళ్లేటప్పుడు హాల్ టికెట్, పరీక్ష ప్యాడ్, బ్లూ, బ్లాక్ పెన్నులు తీసుకెళ్లాలి. ప్రశ్నపత్రంలో ఉన్న పేజీలు ప్రింట్, క్రమ సంఖ్య, మీడియం సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. ఓఎంఆర్ షీట్‌లో ఉన్న విద్యార్థి వివరాలను సరిచూసుకోవాలి.

ఆరో తరగతిలో 80 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇందులో 75శాతం గ్రామీణ ప్రాంతాల వారికి, 25శాతం నగర ప్రాంత విద్యార్థులకు కేటాయించారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి సీటు సాధిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుంది.

మూడు విభాగాల్లో పరీక్ష

ప్రవేశ పరీక్ష విరామం లేకుండా రెండుగంటలపాటు కొనసాగుతుంది. వంద మార్కులకు 80 ప్రశ్నల ప్రశ్నపత్రం ఉంటుంది. మూడు విభాగాల్లో ఐచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. రీజనింగ్ మేధాశక్తిలో 40 ప్రశ్నలు 50 మార్కులు, గణితంలో 20 ప్రశ్నలు 25 మార్కులు, తెలుగు లేదా ఆంగ్లంలో ఐదు ప్యాసేజ్‌లు, ఒక్కో పాఠ్యాంశానికి నాలుగు చొప్పున ప్రశ్నలు ఉంటాయి. వాటికి 25 మార్కులు ఉంటాయి.

సమయం:
శనివారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు
పరీక్ష కేంద్రాలు: 28
మహబూబాబాద్ -5 కేంద్రాలు, ములుగు -3, జనగామ -4, భూపాలపల్లి -1, సిద్దిపేట -1, హనుమకొండ -5, వరంగల్ -9

రీజనింగ్‌లో అధిక మార్కులు

రీజనింగ్ మేధాశక్తి విభాగంలో 40 ప్రశ్నలకు 50 మార్కులు ఉంటాయి. బొమ్మలతో కూడిన ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్న కింద నాలుగు సమాధానాలు బొమ్మల రూపంలో ఉంటాయి. ఈ ప్రక్రియలో సులభంగా మార్కులు పొందడానికి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా సమయస్ఫూర్తితో ఆలోచించాల్సి ఉంటుంది. పాత ప్రశ్నపత్రాలను పరిశీలించడం ద్వారా ఇందులో సులువుగా 45 మార్కులు వరకు పొందే అవకాశం ఉంది.

గణితమే కీలకం

గణిత విభాగంలో 20 ప్రశ్నలు 25 మార్కులు ఉంటాయి. ఐదో తరగతి వరకు అన్ని చాప్టర్లలో ఒకటి లేదా రెండు ప్రశ్నలు అడుగుతారు. భాష పఠనాశక్తిని అంచనా వేసేందుకు భాషా పరీక్ష నిర్వహించనున్నారు. 25 మార్కులకు ఉంటాయి. ఈ విభాగంలో ఐదు పాఠ్యాంశాలు ఇస్తారు. ప్రశ్నలకు సమాధానాలు అన్ని ఒకేలా ఉంటాయి. నిశితంగా గమనిస్తే సమాధానం కచ్చితంగా గుర్తించవచ్చు.

నేడు నియామక ఉత్తర్వులు జారీ

- డిప్యూటీ సీఎం చేతుల మీదుగా జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లకు అందజేత
- 'సాక్షి' వరుస కథనాలకు స్పందన

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ జూనియర్ అసిస్టెంట్ కమ్ ఆపరేటర్లుగా ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 18న నియామక ఉత్తర్వులు అందించనున్నారు. ఈమేరకు అభ్యర్థులకు టీజీ ఎన్పీడీసీఎల్ అధికారులు సమాచారం అందించారు. హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా వారికి నియామక ఉత్తర్వులు అందించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేసింది. జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లుగా ఎంపికై నియామకాల ఉత్తర్వులు అందించకుండా జాప్యం చేయడంపై సాక్షి దినపత్రిక వరుస కథనాలు ప్రచురించింది. గత అక్టోబర్ 3న ఎదురుచూపులు ఎంతకాలం అనే శీర్షికతో, డిసెంబర్ 26న ఎన్నాళ్లీ ఎదురుచూపులు అనే శీర్షికతో, ఈనెల 10న ఆర్డర్స్ అందేదెప్పుడు? అనే శీర్షికతో సాక్షి పలు కథనాలు ప్రచురించింది.


సాక్షి
ఆర్డర్స్ అందేదెప్పుడు

ఇటీవల సాక్షిలో వచ్చిన కథనం

దాంతో యాజమాన్యం స్పందించి ఎట్టకేలకు నియామక ఉత్తర్వులను శనివారం అందించేందుకు సన్నాహాలు చేసింది. 2023, మార్చి 31న నోటిఫికేషన్ విడుదల చేసి అదే సంవత్సరం జూన్ 4న రాత పరీక్ష నిర్వహించారు. 2024 ఆగస్టు 1న ఫలితాలు విడుదల చేసి అదే నెల 22న సర్టిఫికెట్లను పరిశీలించారు. నెలలు గడుస్తున్నా నియామకాలు చేపట్టకపోవడంపై అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యుల మానసిక వేదనలపై సాక్షి వరుస కథనాలు ప్రచురించింది. ఎట్టకేలకు నియామక పత్రాలు అందుకోబోతున్న అభ్యర్థుల సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. వారి కుటుంబ సభ్యుల్లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

20న వరంగల్ డీసీసీబీ మహాజన సభ

హన్మకొండ: ఈనెల 20న వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) మహాజన సభను నిర్వహించనున్నట్లు ఆ బ్యాంక్ ముఖ్య కార్య నిర్వహణాధికారి వజీర్ సుల్తాన్ తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో మహాజన సభ జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్ డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అధ్యక్షతన జరగనున్న సభలో 2024 – 2025వ సంవత్సరంలో సాధించిన ప్రగతి, సాధించాల్సిన అభివృద్ధిపై చర్చించనున్నట్లు తెలిపారు. సభ్యులందరు పాల్గొని మహాజన సభను విజయవంతం చేయాలని కోరారు.

ఎడ్‌సెట్‌ను సమర్థవంతంగా నిర్వహిద్దాం

- కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి


కేయూలో ఎడ్‌సెట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వీసీ, పక్కన రిజిస్ట్రార్, ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: అందరి సహకారంతో ఎడ్‌సెట్ -25ను సమర్థవంతంగా నిర్వహిద్దామని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈసారి తెలంగాణ వ్యాప్తంగా ఎడ్‌సెట్ -25 నిర్వహణ బాధ్యతలను కేయూకు ఉన్నత విద్యామండలి అప్పగించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎడ్‌సెట్ కార్యాలయాన్ని వీసీ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీకి గతంలోనూ కామన్ ఎంట్రెన్స్ టెస్టులను నిర్వహించిన అనుభవం ఉందని వివరించారు. 1990లో ఎడ్‌సెట్, గత 13ఏళ్లుగా ఎస్‌ఐసెట్‌ను కేయూ నిర్వహిస్తోందని గుర్తుచేశారు. ఎడ్‌సెట్ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డిని వీసీ ప్రతాప్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, కేయూ పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ సురేష్‌లాల్, డాక్టర్ రమ, డాక్టర్ సుదర్శన్, చిర్ర రాజు, సీడీసీ డీన్ ప్రొఫెసర్ రాంచంద్రం, ప్రొఫెసర్ రామనాథ్ కిషన్, ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రిన్సిపాల్ ప్రసాద్, ప్రొఫెసర్లు ఈసం నారాయణ, వెంకయ్య, అమరవేణి, నర్సింహాచారి పాల్గొన్నారు.

బకాయిలు పూర్తిగా వసూలు చేయాలి

- మార్చిలోపు పెండింగ్‌లో ఉండకుండా చూడాలి
- సమీక్షలో మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి


సమీక్షలో రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి. అదనపు డైరెక్టర్ రవికుమార్

వరంగల్: వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పేరుకుపోయిన మార్కెట్ ఫీజు బకాయిలను పూర్తిగా వసూలు చేయాలని మార్కెట్ కమిటీ కార్యదర్శులను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ ఆదేశించారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ పరిధిలోని 18 మార్కెట్ కమిటీల కార్యదర్శులతో శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో మార్కెట్ ఫీజుల బకాయిలు, నెలవారీ కొనుగోలు నివేదికలు (పర్చేజ్ రిటర్న్స్), అసెస్‌మెంట్లపై మార్కెట్ల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ లక్ష్మీబాయి మాట్లాడుతూ మార్కెట్ ఫీజు లక్ష్యాలను మార్చి నెలాఖరులోగా సాధించాలన్నారు. పర్చేజ్ రిటర్న్స్ అసెస్‌మెంట్లు చాలా పెండింగ్‌లు ఉన్నాయని, ఇలా ఉంటే ఎలా అని మార్కెట్ కార్యదర్శులపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పర్చేజ్ రిటర్న్స్ ప్రతినెలా 10వ తేదీలోపు వ్యాపారుల నుంచి ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సక్రమంగా పర్చేజ్ రిటర్న్స్ ఇవ్వని వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు మార్కెట్ ఫీజు పాత బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.66 కోట్ల మార్కెట్ ఫీజులు వసూలు చేయాలని నిర్దేశించగా ఇప్పటి వరకు కేవలం రూ.26 కోట్ల మాత్రమే వసూలు చేస్తే మిగిలిన ఫీజులు ఎప్పుడు వసూలు చేస్తారని కార్యదర్శులను లక్ష్మీబాయి ప్రశ్నించినట్లు సమాచారం. ఫిబ్రవరి మొదటి వారంలో మరోసారి సమీక్షా సమావేశం నిర్వహిస్తామని ఆమె అన్నారు. సమావేశంలో జేడీఎం ఉప్పుల శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, వరంగల్ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, డీఎంఓ సురేఖ, గ్రేడ్ 2 కార్యదర్శి రాము, అంజిత్‌రావులతో పాటు జనగామ, మహబూబాబాద్, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ జిల్లాల పరిధిలోని మార్కెట్ కార్యదర్శులు, జిల్లా మార్కెటింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష డప్పులతో వర్గీకరణ ఆకాంక్ష చాటుదాం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ


నెహ్రూ సెంటర్ : డప్పు కొడుతున్న మంద కృష్ణమాదిగ

నెహ్రూ సెంటర్/తొర్రూరు/డోర్నకల్ : లక్ష డప్పులతో ఎస్సీ వర్గీకరణ ఆకాంక్షను ప్రపంచానికి చాటుదామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోరుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వేల గొంతులు – లక్ష డప్పుల కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రం, తొర్రూరు, సీరోలు మండలం మన్నెగూడెంలో శుక్రవారం ఆయన పర్యటించారు. మాదిగ డప్పు కళాకారులతో ర్యాలీలు నిర్వహించారు. తొర్రూరులోని విశ్రాంతి భవనం ఎదుట చెప్పులు కుట్టారు. ఆయా చోట్ల ఉన్న అంబేడ్కర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, సర్వాయి పాపన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా చోట్ల మాట్లాడుతూ మాలలు తమకున్న రాజకీయ పలుకుబడితో ఎస్సీ వర్గీకరణకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని తెలిపారు. 30 ఏళ్ల వర్గీకరణ పోరాటం, వర్గీకరణ సాధనకు ఫిబ్రవరి 7వ తేదీన ప్రపంచానికి జాతి ఆకాంక్ష వినిపించేలా మహత్తర ప్రదర్శన జరగనుందని అన్నారు. మాదిగ జాతి బిడ్డల భవిష్యత్ కోసం, ఉద్యోగాల కోసం ఈ మహత్తర కార్యక్రమం జరగబోతుందని, ఈక్రమంలో జాతి అభివృద్ధికి ప్రతిఒక్కరూ కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మార్పీస్ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ల పీరయ్య మాదిగ, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, నాయకులు దుప్పెల్లి అనిల్‌మాదిగ, కత్తుల రేణు, పోలెపాక ఎల్లయ్య, పాటమ్మ రాంబాబు, బోడ సుమిత్ర, మిడతపల్లి యాకన్న, సోమారపు ఐలయ్య, మహంకాళి బుచ్చయ్య, తాటికాయల సురేందర్, భిక్షపతి, గుండాల రంజిత్, వెంకన్న, మంద యాకమల్లు, తేలూరి ముత్తయ్య, శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా త్రిశూలాల స్నానం

- భక్తులతో కిక్కిరిసిన కొత్తకొండ ఆలయం


కోనేటిలో త్రిశూలానికి స్నానం చేయిస్తున్న అర్చకులు, ఆలయ ఈఓ, ఆలయ చైర్మన్, తదితరులు

ఎల్కతుర్తి: ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధి చెందిన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో తిశూల స్నానాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ముందుగా అర్చకులు స్వామివారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపపూజ, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, అవభృత స్నానం, త్రిశూల స్నానం, హోమాలు, హారతి, మంత్రపుష్పం, బలిహరణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే, అష్టభైరవార్చన, నిత్యప్రాసన, రుద్రహోమం, శక్తిహోమం, మహాపూర్ణహుతి అనంతరం త్రిశూల స్నాన ఘట్టం ప్రారంభం కాగా, కుమ్మరి వంశీయులు స్వామివారి నామ స్మరణ చేస్తూ స్వామివారి పల్లేరం నిర్వహించారు. మేళతాళల మధ్య చేసిన పల్లేరు విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయ కోనేటిలో స్వామివారి త్రిశూల స్నానాన్ని అర్చకులు వేద మంత్రోచ్ఛరల మధ్య జరిపించారు.

కిక్కిరిసిన భక్తజనం

కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణమంతా భక్తులతో శుక్రవారం కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి సుమారు 2గంటల సమయం పట్టింది. ఆలయ ప్రాంగణం వెలుపల 200మీటర్ల పొడవు వరకు భక్తులు బారులుదీరారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ కిషన్‌రావు, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా, సీఐ పులి రమేష్, ఎస్సై సాయిబాబు, ముఖ్య అర్చకుడు రాంబాబు, అర్చకులు వినయ్‌శర్మ, రాజయ్య, శ్రీకాంత్, వీరభద్రయ్య, రమేష్, శివకుమార్, సందీప్, చరత్‌చంద్ర, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, శనివారం తెల్లవారుజామున అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కిషన్‌రావు తెలిపారు.


వీరభద్రస్వామికి మొక్కులు చెల్లిస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

పూజలు చేసిన ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

కొత్తకొండ వీరభద్రస్వామిని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.

కొనసాగుతున్న అన్నారం దర్గా ఉర్సు


గంధంతో యాకూబ్‌షావలి మజర్


దీపారాధన


జాతరలో విడిది చేస్తున్న భక్తులు

- యాకూబ్‌బాబాను దర్శించుకున్న వేలాదిమంది
- ఘనంగా దీపారాధన

పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్‌లోని యాకూబ్ షావలి దర్గాలో రెండో రోజు ఉర్సు ఉత్సవాల్లో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం తెల్లవారు జామున గంధం సమర్పణ అనంతరం సాయంత్రం దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీపారాధన కార్యక్రమం అనంతరం భక్తులు అధిక పాల్గొని యాకుబ్ బాబా దర్గాతోపాటు గుంషావళి, బోలేషావళి, మహబూబియా, చిల్లాలను దర్శించుకున్నారు.

అన్నారం దర్గాను అభివృద్ధి చేస్తా..

రాష్ట్రంలో అతి పెద్ద దర్గా అయిన అన్నారం దర్గాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలంగాణ వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మత్ ఉల్లాహుస్సేన్ అన్నారు. శుక్రవారం దీపారాధన కార్యక్రమంలో భాగంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఎక్కడా లేని విధంగా అన్నారం దర్గాను అభివృద్ధి చేస్తానని, ఎన్ని కోట్ల నిధులైనా వెచ్చించి భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అన్నారం దర్గా అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరినప్పటికీ గత పాలకులు విస్మరించారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో దర్గాలకు నిధుల ఢోకా లేదని తెలిపారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కిసాన్ కాంగ్రెస్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, గొడుగు భిక్షపతి, సారంగపాణి, కందికట్ల అనిల్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్, ముజావర్లు గౌస్‌పాషా, యాకుబ్‌పాషా, ఖాజాపాషా, షాబీర్‌పాషా, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. దర్గా ఆవరణలో వక్ఫ్‌బోర్డు సమక్షంలో ఏర్పాటు చేసిన మహా అన్నదానాన్ని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్ ప్రారంభించారు. సుమారు 2000 మంది అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు.

దర్శించుకున్న ఎర్రబెల్లి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ మనోజ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు షబ్బీర్ అలీ, రాజు, మాజీ సర్పంచ్‌లు కృష్ణ, శ్రీనివాస్, సంతోశ్, యాకయ్య, మనోహర్, పాషా పాల్గొన్నారు.

మహా ప్రదర్శనను విజయవంతం చేయండి

- కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్


సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్

హన్మకొండ: హనుమకొండలో ఈనెల 20న నిర్వహించనున్న లక్ష డప్పులు.. వేల గొంతుల సన్నాహక మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ప్రముఖ కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్ పిలుపునిచ్చారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సీఎం రేవంత్ రెడ్డి అనుకూలంగా ఉన్నా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ఎస్సీ జాబితాలోని అన్ని కులాల వారికి విద్య, ఉద్యోగాలతో పాటు అన్ని రంగాల్లో జనాభా ప్రాతిపదికన సమాన వాటా దక్కాలనే ప్రధాన ధ్యేయంతో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకు 30 ఏళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా ఇచ్చిన తీర్పును రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్‌తో, మాలల కుట్రలు తిప్పి కొట్టేందుకు ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో వెయ్యి గొంతులు.. లక్ష డప్పుల మాదిగల సాంస్కృతిక మహా ప్రదర్శన నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి ఈనెల 20న హనుమకొండలోని వేయి స్తంభాల దేవాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు సన్నాహక మహా ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాజన సోషలిస్టు పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బందారి సురేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్, రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్ రెడ్డి, ఆయా సంఘాల నాయకులు మంద కుమార్ మాదిగ, సుకుమార్, బొడ్డు దయాకర్ మాదిగ, బొచ్చు తిరుపతి మాదిగ, మేకల కేదారి యాదవ్, బైరపాక జయకర్, వీరదాసు వెంకటరత్నం మాదిగ, నీలా శ్రీధర్‌రావు, తండూరి మోహన్, వేల్పుల సూరన్న కాపు పాల్గొన్నారు.

బిడ్డ జైలుకెళ్లి వచ్చింది.. ఇప్పుడు కొడుకు వంతు..

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం

రఘునాథపల్లి: లిక్కర్ కుంభకోణం కేసులో మాజీ సీఎం కేసీఆర్ బిడ్డ కవిత తీహార్ జైలుకు వెళ్లి వస్తే.. కొడుకు కేటీఆర్ కూడా ఈ– ఫార్ములా రేస్ కేసులో జైలుకు వెళ్లనున్నాడని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం రఘునాథపల్లి మండలం నిడిగొండలో జరిగిన కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎంపీ కడియం కావ్యతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. అవినీతికి పాల్పడిన కేటీఆర్ తీరు క్విడ్ ప్రొకో కిందకు రాదా..? అని ప్రశ్నించారు. అక్రమాలకు పాల్పడి ప్రజాధనం దోచుకున్న కేటీఆర్, కవితల వైఖరితో తెలంగాణ పరువు పోయిందన్నారు. కేటీఆర్ అహంకారంతో అంటున్నట్టు ఈ-ఫార్ములా రేస్ కేసు లొట్టపీసు కేసు అయితే ఏసీబీ, ఈడీ ఆయనను ఎందుకు పిలుస్తున్నాయని ప్రశ్నించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో అవినీతి, అక్రమాలు రాజ్యమేలాయని విమర్శించారు. తాను కాంగ్రెస్ పిలుపు మేరకు నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారానని, రూ.750 కోట్లతో పలు పనులకు వచ్చే నెలలో సీఎం శంకుస్థాపన చేస్తారని చెప్పారు.

హాబీస్.. హ్యాపీస్

కొంతమంది చిన్న చిన్న విషయాలకే ఆందోళన పడిపోతుంటారు. కొందరు ఎన్ని బాధలు ఎదురైనా సంతోషంగా ఉండేందుకు ప్రయత్నిస్తుంటారు. సంతోషంగా ఉండటమనేది పూర్తిగా మన వ్యక్తిత్వం, అలవాట్ల పైనే ఆధారపడి ఉంటుందని నిపుణులు అంటారు. వీళ్లు ఎన్ని బాధలు ఎదురైనా సంతోషాన్ని దూరం చేసుకోరు. అదెలా సాధ్యం? సంతోషంగా ఉండే వారి అలవాట్లు ఏంటో తెలుసుకుందామా?





సంతోషంగా ఉండేవారు కుటుంబంతోనూ, స్నేహితులతోనూ ఎక్కువ సమయం గడపడటానికి ఇష్టపడతారని, వీరిని కష్టాలు, బాధలు చుట్టిముట్టినప్పుడు తమ కుటుంబం, స్నేహితులతోనే వాటిని పంచుకుంటూ మనసు తేలిక చేసుకుంటారన్నది హ్యాపీ పీపుల్ హ్యాబిట్స్‌లో బయట పడిన విషయం. వీరు తాము సంతోషంగా ఉంటూ, తమ కుటుంబాన్ని, స్నేహితులనూ కూడా సంతోషంగా ఉండేలా చూస్తారు.

పొద్దున్నే నిద్రలేవడం

సంతోషంగా ఉన్న వ్యక్తులు ఉదయాన్నే నిద్రలేస్తారు. పని ఉన్నా... లేకున్నా పొద్దున్నే లేవడం మానుకోరు. తమకు తాముగా కొన్ని నిబంధనలు, పరిమితులు విధించుకుని తమ రోజును ప్రారంభిస్తారు. అలాగే వ్యాయామం, ఆధ్యాత్మిక చింతన, కొత్త విషయాలను తెలుసుకోవడం, పరిశోధనలు, అధ్యయనం వంటి వాటితో నాణ్యమైన సమయాన్ని గడుపుతారు.

ధ్యానం

సంతోషంగా ఉన్నవారు ధ్యానంలో ఎక్కువ సమయాన్ని గడుపుతారు. ధ్యానంతోనే తమ ప్రతికూల ఆలోచనలను నియంత్రిస్తారు. సానుకూలతను పొందడానికి ప్రయత్నిస్తారు. సంతోషకరమైన, స్వీయ–అవగాహన ఉన్న వారికి ధ్యానం ఒక ముఖ్యమైన అలవాటు.

ప్రకృతిలో గడపడం



ఎప్పుడూ సంతోషంగా ఉండేవారు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడంతోపాటు ప్రకృతితో మంచి సమయాన్ని గడపడాన్ని ఇష్టపడతారు. ఇది మానసిక స్థితిని ప్రభావితం చేస్తుంది. మనస్సును నిర్మలంగా ఉంచుతుంది. నకారాత్మక ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెడుతుంది. అలాగే తమతో తాము మరింతగా కనెక్ట్ అయ్యేలా చేస్తుంది.

ఆరోగ్యకరమైన ఆహారం

సంతోషంగా ఉన్న వ్యక్తులు క్రమం తప్పకుండా ఆరోగ్యకరమైన ఆహారాన్నే తినడానికి ప్రయత్నిస్తారు. అలాగే ప్రతిరోజూ ఉదయం బ్రేక్ ఫాస్ట్ తో పాటు తగినన్ని నీటిని తాగుతారు.

కంటినిండా నిద్ర



మన శరీరానికి నిద్ర చాలా చాలా అవసరం. ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ రాత్రి 7 నుంచి 9 గంటల రాత్రి నిద్ర చాలా అవసరం. నాణ్యమైన నిద్ర మనసును సంతోషంగా ఉంచుతుంది. తగినంత నిద్ర లేనివారు చికాకు పడుతూ చిర్రుబుర్రులాడటం చూస్తూనే ఉంటాం.

కనీస వ్యాయామం

ఎప్పుడు చూసినా ఉత్సాహంగా.. ఉల్లాసంగా ఉండే వారు శరీరానికి, మెదడుకూ కూడా తగినంత వ్యాయామం కల్పిస్తారని పరిశోధనలలో తేలింది. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ కనీసం వాకింగ్, రన్నింగ్, జాగింగ్, తేలికపాటి బరువులు ఎత్తడం, లిఫ్ట్ ఉపయోగించకుండా మెట్లెక్కడం, గార్డెనింగ్ వంటి శారీరక వ్యాయామం తోపాటు మెదడును పదును పెట్టే చెస్, బిజినెస్, క్రాస్‌వర్డ్స్ పూరించడం, సుడోకు వంటి వాటిలో పాల్గొనడం వల్ల సంతోషంగా ఉండగలరు.

అంటే మన అలవాట్లు... అదేనండీ.. హాబీసే... హ్యాపీస్ అన్నమాట. కాబట్టి మంచి అలవాట్లతో మరింత సంతోషంగా జీవిద్దాం.

లైఫ్@360

• ప్లీజ్ క్లీన్

వాడ్డర్ బాటిల్



ఒకప్పుడు ప్రయాణాలలో మాత్రమే వెంట తీసుకెళ్లే వాటర్ బాటిల్స్‌ని ఇప్పుడు మనం పని చేసే సిస్టమ్ పక్కన లేదా మంచం పక్కన పెట్టుకోకుండా ఉండలేని పరిస్థితి వచ్చింది. ఎప్పుడు కావాలంటే అప్పుడు తాగేందుకు వీలుగా వాటర్ బాటిల్స్‌ని దగ్గర పెట్టుకోవడం వరకు తప్పేం లేదు కానీ, వాటిని సరిగా శుభ్రం చేయకపోవడం వల్ల వాటి మీద మిలియన్లకొద్దీ సూక్ష్మజీవులు పేరుకుని పోయి రకరకాల జబ్బులు వస్తున్నాయని హెచ్చరిస్తున్నారు వైద్య, ఆరోగ్య పరిశోధకులు.

తాళం చెవులు, సెల్‌ఫోన్, మనీపర్స్, హ్యాండ్ బ్యాగ్‌లాగే వాటర్ బాటిల్ కూడా తప్పనిసరిగా వెంట తీసుకునిపోయే అవసరంగా మారింది. అయితే కొన్ని పరిశోధనల ప్రకారం తెలిందేమిటంటే, వాటర్ బాటిల్‌ను సరిగా శుభ్రం చేయకపోవడం వల్ల టాయిలెట్ సీట్ మీద కన్నా ఎన్నో ఎక్కువ రెట్లు సూక్ష్మజీవులు, బాటిల్ మీద, లోపల, మూత మీద బ్యాక్టీరియా పేరుకుపోతుందట. మనం ఇప్పుడు చెప్పుకోబోయే విషయాలు వినడానికి కొంచెం వింతగా... మరి కొంచెం బాధాకరంగా కూడా ఉండచ్చు. అయినా, చెప్పుకోక తప్పదు మరి!

స్ట్రా ద్వారా తాగే బాటిల్స్, సిప్పర్ బాటిల్స్, అలాగే నోటికి కరిపించుకుని తాగే బాటిల్స్... ఈ మూడు రకాల బాటిల్స్‌లోనూ రెండు రకాలైన బ్యాక్టీరియాను కనుగొన్నారు పరిశోధకులు. ఈ బ్యాక్టీరియా టైఫాయిడ్‌ను కలిగిస్తుంది. అందువల్ల తిరిగి వాడే వాటర్ బాటిల్స్‌ను తీరుబడిగా వారానికోసారి కాకుండా ప్రతిరోజూ సబ్బునీటితో, వేడి నీటితో శుభ్రంగా కడిగి ఉపయోగించడం చాలా మంచిది లేదంటే వ్యాధుల బారిన పడటం ఖాయం మరి!

• యోగా

వెన్నునొప్పి నివారణకు గోముఖాసన



ఆవు ముఖ భంగిమను పోలి ఉంటుంది కాబట్టి దీనికి గో ముఖాసన అని పేరు. శరీరం మొత్తం స్ట్రెచ్ అవుతుంది. కాళ్లు ఒకదానికి మీద ఒకటి చేరే ఈ ఆసనం చూడ్డానికి ఆవు ముఖంలా కనిపిస్తుంది. చేతులు ఆవు ముఖం చెవులను సూచిస్తాయి.

ఇలా చేయాలి..

- ముందుగా సౌకర్యంగా చాప మీద కూర్చోవాలి. ఎడమ కాలును మోకాలి వద్ద వంచుతూ కుడి తుంటి భాగానికి దగ్గరగా తీసుకువెళ్లాలి.
- మోకాళ్లు ఒకదానిపై ఒకటి ఉండేలా సెట్ చేయాలి.
- కుడి చేతిని పైకి లేపి, మోచేయి వద్ద వంచి, వీపు కిందకు ఉంచాలి.
- ఎడమ చేతిని వీపు వెనకకు తీసుకువెళ్లి, కుడి చేతిని పట్టుకోవడానికి ప్రయత్నించాలి.
- రెండు చేతులు కలవకపోతే ఆ ఖాళీని భర్తీ చేయడానికి టవల్ లేదా స్కార్ఫ్‌ను ఉపయోగించాలి.
- వెన్నెముకను నిటారుగా ఉంచి, కూర్చోవాలి.
- దీర్ఘ శ్వాస తీసుకొని, వదులుతూ సౌకర్యంగా అనిపించేంత వరకు ఈ ఆసనంలో ఉండచ్చు.
- మెల్లగా కాళ్లు, చేతులు విడదీసి యధాస్థితికి రావాలి. రెండోవైపు పై విధంగానే చేయాలి.

ప్రయోజనాలు..

డెస్క్ ఉద్యోగాలు చేసేవారిలో బ్యాక్ పెయిన్, హిప్ స్ట్రెస్ సాధారణంగా గమనిస్తుంటాం. వెన్నెముక స్ట్రెచ్ అవ్వడం వల్ల బ్యాక్‌పెయిన్ సమస్య తగ్గుతుంది. తుంటి, రక్తప్రసరణ, కీళ్ల కదలికలు మెరుగవుతాయి. దీర్ఘ శ్వాసలు తీసుకొని, వదలడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడి తగ్గుతుంది.

వెన్ను, మోకాలు గాయాలు ఉన్నవారు నిపుణుల సాయం తీసుకోవాలి. కింద కూర్చోనేటప్పుడు కుషన్‌ను కాలు మడతల్లో ఉంచవచ్చు. తుంటి నొప్పి వస్తుంటే సాధారణ సుఖాసనలో కూర్చొని కూడా ఈ ఆసనాన్ని సాధన చేయవచ్చు.

చెప్పకోదగ్గ విశేషం



పాదరక్షలు సురక్షితమైన నడకకు అత్యవసరాలు. పాదరక్షల ప్రయోజనం అక్కడికే పరిమితం కాలేదు. ఫ్యాషన్‌రంగంలోనూ పాదరక్షల పాత్ర పెరుగుతూ వస్తోంది. ఫ్యాషన్ స్థాయిని దాటిన అల్ట్రాలగ్జరీ పాదరక్షలు లేటెస్ట్ ట్రెండ్. ఈ పాదరక్షలు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనవిగా రికార్డులకెక్కాయి. వీటిని కొనాలంటే, ఒక మోస్తరు సంపన్నుల ఆస్తులు కూడా చాలవు. ఇవి 'మూన్ స్టార్ షూస్'. దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా గౌరవార్థం ఇటాలియన్ డిజైనర్ ఆంటోనియో వీట్రీ వీటికి రూపకల్పన చేశారు. ప్రపంచంలోనే అతి ఎత్తయిన కట్టడం బుర్జ్ ఖలీఫా ఆకారాన్ని తలపించేలా రూపొందించిన ఈ పాదరక్షల ఖరీదు 19.9 మిలియన్ డాలర్లు. అంటే, రూ.164 కోట్లు. ఈ పాదరక్షల జత తయారీకి బంగారం, వజ్రాలతో పాటు గ్రహాంతర పదార్థాన్ని కూడా ఉపయోగించారు. అందుకే వీటి ధర అంతరిక్షాన్ని తాకే స్థాయిలో ఉంది. ఈ పాదరక్షల అడుగుభాగాన్ని తెల్లబంగారంతో తయారు చేశారు. పైభాగాన్ని పూర్తిగా మేలిమి బంగారంలో 30 కేరట్ల వజ్రాలను పొదిగి తయారు చేశారు. వీటి తయారీ లో క్రీస్తుశకం 1576లో అర్జెంటీనాలో రాలిపడిన ఉల్క నుంచి సేకరించిన పదార్థాన్ని కూడా ఉపయోగించడం విశేషం.

సాక్షి సినిమా

మంచి మాట వినాలి



• పవన్ కల్యాణ్



• ప్రియాంకా చోప్రా

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'హరి హర వీరమల్లు: పార్ట్–1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. నిధీ అగర్వాల్, నర్గీస్ ఫక్రీ, నోరా ఫతేహి, బాబీ డియోల్ తదితరులు ముఖ్య పాత్రధారులు. ఏఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 28న రిలీజ్ కానుంది. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందించిన 'హరి హర వీర మల్లు' నుంచి 'మాట వినాలి..' అంటూ సాగే తొలి పాటని రిలీజ్ చేశారు. 'మాట వినాలి గురుడా మాట వినాలి... మాట వినాలి... మంచి మాట వినాలి...' అంటూ సాగే ఈ పాటని పవన్ కల్యాణ్ పాడారు. ఈ పాటను పెంచల్ దాస్ రాశారు. ఈ చిత్రం ఐదు భాషల్లో రిలీజ్ కానుంది. ఈ క్రమంలో ఈ పాటను తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ వెర్షన్‌లోనూ రిలీజ్ చేశారు.



• 'దిల్' రాజు, ఐశ్వర్యా రాజేశ్, వెంకటేశ్, అనిల్ రావిపూడి, శిరీష్

ఇది తెలుగు ప్రేక్షకుల విజయం

- వెంకటేశ్

"కష్టపడి పని చేస్తే ఫలితం వస్తుందని నా నమ్మకం. ఆ నమ్మకాన్ని 'సంక్రాంతికి వస్తున్నాం' విజయం మరోసారి రుజువు చేసింది. ఇది మా విజయమే కాదు.. ఇంత గొప్పగా సపోర్ట్, లవ్ చేసిన తెలుగు ఆడియన్స్, ఫ్యాన్స్ సక్సెస్. ఇది తెలుగు ప్రేక్షకుల విజయం'' అని హీరో వెంకటేశ్ అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'పొంగల్ బ్లాక్ బస్టర్ జాతర సెలబ్రేషన్స్'లో వెంకటేశ్ మాట్లాడుతూ– "డైరెక్టర్ అనిల్, నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్‌గార్లకు, సినిమా యూనిట్‌కి థ్యాంక్స్. ఫిల్మ్ ఇండస్ట్రీలోని అందరూ మనస్ఫూర్తిగా ఫోన్ చేసి సినిమా బాగుందని అభినందిస్తున్నందుకు ధన్యవాదాలు'' అని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ– "మేము ఊహించినదానికంటే సినిమాని ఎక్కువ స్థాయికి తీసుకెళ్లిన తెలుగు ప్రేక్షకులకు నా పాదాభివందనాలు. ఈ సినిమాతో నా కెరీర్‌లో ఎనిమిది సక్సెస్‌లు అంటున్నారు... ఆడియన్స్ సపోర్ట్ లేకపోతే నాకు ఈ విజయం వచ్చేది కాదు'' అన్నారు. "వెంకటేశ్‌గారు నిర్మాతల బాగు కోరుకుంటారు. కాబట్టే ఇప్పటికీ కాలర్ ఎగరేస్తూ ముందుకు వెళ్తున్నారు'' అని శిరీష్ పేర్కొన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– "అనిల్, వెంకటేశ్‌గారి కాంబినేషన్‌లో సినిమా అంటే పాజిటివ్ వైబ్రేషన్. ఇది మాకు బ్లాక్ బస్టర్ పొంగల్'' అని చెప్పారు. "నేను చేసిన భాగ్యం పాత్ర క్రెడిట్ అంతా అనిల్‌గారికే దక్కుతుంది'' అన్నారు ఐశ్వర్యా రాజేశ్. ఈ వేడుకలో నటులు అవసరాల శ్రీనివాస్, శ్రీనివాస్ వడ్లమాని, మురళీధర్ గౌడ్, కెమెరామేన్ సమీర్ రెడ్డి, ఆర్ట్ డైరెక్టర్ ఏఎస్ ప్రకాశ్, ఎడిటర్ తమ్మిరాజు, రచయితలు అజ్జు మహాకాళి, నాగ్, సాయి కృష్ణ తదితరులు మాట్లాడారు.

ఆహా ఏమి రుచి...





• చేపల కూర వండుతున్న నాగ చైతన్య

కట్టెల పొయ్యి వెలిగించారు నాగ చైతన్య. ఎందుకంటే చేపల పులుసు వండటానికి. వండాక అందరికీ వడ్డించారు కూడా. అందరూ 'బాగుంది' అని మెచ్చుకుంటూ, ఫుల్లుగా లాగించేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. ఇంతకీ చైతన్య ఇలా చేపల కూర వండటానికి కారణం ఏంటంటే... ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికే. 'తండేల్' చిత్రంలో ఈ హీరో మత్స్యకారుడి పాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. విశాఖపట్నం, శ్రీకాకుళం తీర ప్రాంతాల్లోనూ ఈ చిత్రం షూటింగ్ జరిపారు. కాగా, 'మీ స్టయిల్‌లో చేపల కూర వండి పెడతా' అని విశాఖలో చిత్రీకరణలో పాల్గొన్నప్పుడు నాగచైతన్య అన్నారట. అన్నట్లుగానే చేపల కూర వండారు. కూర వండాక, అర చేతిలో కాస్త పులుసు వేసుకుని, రుచి చూసి, పక్కనే ఉన్న అమ్మాయికి ఇస్తే, 'బాగుందండి...' అని ఆమె అనడం, ఆ తర్వాత చైతు అక్కడ ఉన్నవారికి పులుసు వడ్డించి తాను కూడా తినడం వంటివన్నీ చిత్రీకరించి, ఆ వీడియోను షేర్ చేసింది చిత్రబృందం. ఇక ఆ వీడియోలో 'బాగుందా' అని చైతన్య అడగ్గా... ఆహా ఏమి రుచి అనే టైపులో 'బాగుంది.. చాలా బాగుంది' అంటూ అక్కడివాళ్లు తింటుంటే... 'పక్కానా... బాగోకపోతే ఏమీ అనుకోమాకండి... ఫస్ట్ టైమ్' అంటూ, వాళ్లతో కలిసి తానూ తిన్నారు చైతన్య. ఇక శ్రీకాకుళానికి చెందిన మత్స్యకారుల జీవిత కథతో రూపొందుతున్న 'తండేల్'లో నాగచైతన్య సరసన సాయి పల్లవి నటిస్తున్నారు. చందు మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 7న రిలీజ్ కానుంది.

లాస్ ఏంజెల్స్ టు హైదరాబాద్

ప్రముఖ హీరోయిన్ ప్రియాంక చోప్రా హైదరాబాద్‌లో అడుగుపెట్టారు. అందులో విషయం ఏముందీ అనుకోవచ్చు. సింగర్, యాక్టర్ నిక్ జోనాస్‌తో పెళ్లి తర్వాత అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో స్థిరపడ్డారు ప్రియాంక. ఇప్పుడు ఇలా హైదరాబాద్‌లో అడుగుపెట్టడానికి కారణం ఏంటి? అనేది హాట్ టాపిక్‌గా మారింది. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందనున్న సినిమా కోసమే ఆమె భాగ్యనగరానికి చేరుకున్నారని టాక్. ఈ చిత్రంలో మహేశ్‌బాబుకి జోడీగా నటించే హీరోయిన్ల జాబితాలో ప్రియాంకా చోప్రా, కియారా అద్వానీ, ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ వంటి వారి పేర్లు తెరపైకి వచ్చాయి. ఫైనల్‌గా ప్రియాంకా చోప్రాని కథానాయికగా ఫిక్స్ చేశారని భోగట్టా. ప్రియాంకా చోప్రా లాస్ ఏంజెల్స్ నుంచి హైదరాబాద్‌కి చేరుకోవడంతో ఈ మూవీ చిత్రీకరణ కోసమే ఆమె వచ్చారనే రూమర్లు వినిపిస్తున్నాయి. మరి... ఈ వార్త ఎంతవరకూ నిజమో తెలియాల్సి ఉంది.

శివరాత్రికి థ్రిల్



• ప్రజ్వల్ దేవరాజ్

కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటిస్తున్న చిత్రం 'రాక్షస'. లోహిత్ .హెచ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 26న కన్నడతో పాటు తెలుగులోనూ రిలీజ్ కానుంది. తెలుగు విడుదల హక్కులను కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ అధినేత ఎంవీఆర్ కృష్ణ దక్కించుకున్నారు. గతంలో శివరాజ్ కుమార్ హీరోగా నటించిన 'వేద' చిత్రాన్ని ఆయన విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎంవీఆర్ కృష్ణ మాట్లాడుతూ– "హారర్ నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'రాక్షస'. మా సినిమా ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. త్వరలోనే టీజర్, ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం'' అని చెప్పారు.

వెరైటీ యాక్షన్



• సత్య

సత్య వినుగొండ, అనుశ్రీ లీడ్ రోల్స్‌లో ఎస్ఎస్ మూవీ కార్పొరేషన్ పై సత్య వినుగొండ స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'వాషింగ్టన్ సుందర్'. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను 'జాతి రత్నాలు' దర్శకుడు అనుదీప్ ఆవిష్కరించారు. సత్య వినుగొండ మాట్లాడుతూ– "వెరైటీ యాక్షన్ నేపథ్యంలో సాగే ఫన్ ఎంటర్‌టైనర్ మూవీ ఇది. మార్చిలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం'' అని తెలిపారు.

నీకు దెబ్బలేమీ తగల్లేదు కదా...



• సోనూగా... లైలాగా విశ్వక్

విశ్వక్ సేన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆకాంక్షా శర్మ హీరోయిన్‌గా నటించారు. సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. 'చూసుకో... అయ్యయ్యో నీకు దెబ్బలేమీ తగల్లేదు కదా', 'మనకు తెల్లగ జేసుడే కాదు... తోలు తీసుడు కూడా వచ్చు' అంటూ విశ్వక్ సేన్ చెప్పే డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. "రొమాంటిక్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'లైలా'. ఈ మూవీలో మోడల్ సోనూగా, లైలా అనే అమ్మాయిగా విశ్వక్ సేన్ కనిపించే రెండు డిఫరెంట్ లుక్స్ సినిమాపై బజ్ క్రియేట్ చేశాయి'' అని యూనిట్ పేర్కొంది.

సుకృతి నటన చూసి షాక్ అయ్యాను

- సుకుమార్



• నవీన్, రవిశంకర్, సుకుమార్, సుకృతి, తబితా సుకుమార్, పద్మావతి, శేష సింధూరావు

"నా కుమార్తె సుకృతికి చిన్నప్పటి నుంచి పాడటం అంటే చాలా ఇష్టం. కానీ, నటన మీద పెద్దగా ఆసక్తి లేదు. తను నటిస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. అయితే దర్శకురాలు పద్మ, నిర్మాత సింధు కలిసి సుకృతిని నటించేందుకు ఒప్పించారు. 'గాంధీ తాత చెట్టు'లో సుకృతి నటన చూసిన తర్వాత షాక్ అయ్యాను.. అంత బాగా నటించింది'' అని డైరెక్టర్ సుకుమార్ తెలిపారు. ఆయన కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వం వహించారు. సుకుమార్ భార్య తబితా సుకుమార్ సమర్పణలో నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధూరావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సుకుమార్ మాట్లాడుతూ– "ఈ చిత్రం సుకృతి లైఫ్‌లో మంచి జ్ఞాపకంలా మిగిలిపోతుంది. వినోదం, సందేశం ఉన్న 'గాంధీ తాత చెట్టు'ని అందరూ ఆదరించాలి'' అన్నారు. "ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ పిల్లలతో కలిసి చూడాలి'' అన్నారు యలమంచిలి రవిశంకర్. "ఈ సినిమా ఎక్కడా బోర్ కొట్టకుండా అందరికీ నచ్చుతుంది'' అన్నారు నవీన్ ఎర్నేని. "షూటింగ్‌లో తొలి రోజు సుకృతి నటన చూసి హ్యాపీ ఫీలయ్యాను'' అని తబితా సుకుమార్ పేర్కొన్నారు. "ఒక చెట్టుకు, మనిషికి మధ్య ఉన్న అనుబంధంతో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు పద్మావతి మల్లాది. "ఈ సినిమా కోసం నాన్న (సుకుమార్) ఎటువంటి సలహాలు ఇవ్వలేదు'' అని సుకృతి బండ్రెడ్డి తెలిపారు.